క్లుప్తంగా

రుద్రయాగంలో అనపర్తి ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న రుద్రయాగ కమిటీ

రాయవరం: సోమేశ్వరంలో జరుగుతున్న పంచాయతన సహిత మహారుద్రయాగంలో అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. సతీమణి ఆదిలక్ష్మితో కలిసి ఆయన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహారుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభంతో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులకు స్వాగతం పలికారు. పూజల అనంతం వేద ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి కోరుతూ గ్రామస్తులంతా ఏకమై భారీ వ్యయంతో మహా రుద్రయాగాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీఅలివేలు మంగ శ్రీగోదాదేవీ సమేత శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్ర పూజలను ఆదివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం తెలిపారు. తెల్లవారుజామున ఐదు గంటలకు ఆలయ ప్రధానార్చకుడు బాల బాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి పంచామృతాభిషేకం చేయడంతో పూజలు ప్రారంభమవుతాయన్నారు.

జ్యోతిర్లింగాలను దర్శించిన భక్తులు

కాజులూరు: స్థానిక బ్రహ్మకుమారీస్ సభ్యులు శనివారం శివ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కాకినాడ బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకులు బి.కె.రజనిదీధి ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయ ఆవరణలో శిబిరాలను ఏర్పాటు చేసి ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శివలింగాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. చిత్ర పటల ద్వారా బ్రహ్మకుమారీస్ సంస్థ విధి విధానాలను సభ్యులు భక్తులకు వివరించారు. బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వహకులు బి.కె.రామలక్ష్మి మాట్లాడుతూ గత 29 సంవత్సరాలుగా శివజయంతి పురస్కరించుకుని దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాలకు చెందిన శివలింగాలను శివరాత్రి రోజున గ్రామంలోని భక్తుల దర్శనార్థం ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన బ్రహ్మకుమారీస్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి


సమావేశంలో డేనియల్‌పాల్, జమాతే సభ్యులు

మండపేట: సమాజంలో నైతిక విలువలు పెంపొందించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జమాతే ఇస్లామి హింద్ మండపేట శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జీసస్ క్రైస్ట్ గ్లోరీ క్యాంపస్‌లో మానవత- నైతికత ఆత్మీయ సమావేశం జరిగింది. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ డేనియల్ పాల్ మాట్లాడుతూ ప్రజల్లో జవాబుదారీతనం, నైతికత పెంపొందించేందుకు జమాతే చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ సేవా కార్యక్రమాల కోసం రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. జమాతే రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ నేడు సమాజంలో మానవత్వం తగ్గి స్వార్థం పెరిగిపోతోందన్నారు. జమాతే నాయకులు షరీఫ్, అబులాలా, రిజ్వాన్, అమిర్ తదితరులు ప్రసంగించారు. ఎస్ఐఒ , ఐవైఎం సభ్యులు పాల్గొన్నారు.

పేద మహిళకు యూత్ సాయం

మండపేట: మండలంలోని కేశవరానికి చెందిన కరుణామయ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు పమ్మి వెంకాయమ్మకు 25 కేజీల బియ్యం, కూరగాయలు, రూ.1000 ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పోసుపో అశోక్‌బాబు ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పీఎంపీ వై.శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ సాయం అందించారు. సంస్థ వ్యవస్థాపకుడు మందపల్లి పోలాప్రతాప్ మాట్లాడుతూ గ్రామంలో కూలిపని చేసుకునే కొందరు యువకులు సంస్థగా ఏర్పడి చేతనైనంతలో ప్రతీనెల సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి దయానంద్, చంద్రమళ్ల సుధీర్, సమతం చినపాపారావు, చుక్కా రాజేష్, నాగేంద్రబాబు, రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీను, రవిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటికి మొక్కులు


ఏడిద సంగమేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


సోమేశ్వరం ఆలయంలో సోమేశ్వరస్వామికి అభిషేకాలు

- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- అభిషేకాలు, యాగాలు, లక్ష పత్రి పూజలు
- పరమ శివుని దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు
- పలుచోట్ల అన్నదానాలు

మండపేట: ఎక్కడ చూసినా శివనామ స్మరణ మారుమోగింది. శనివారం మహా శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలో ప్రసిద్ధి చెందిన ఏడిద సంగమేశ్వరాలయం, పట్టణంలోని అగస్త్యేశ్వర కైలాసేశ్వర స్వామివారి ఆలయాల్లో భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. భజన, కోలాటాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు అనంతరం, శివునికి బూరెలతో అభిషేకం చేశారు. స్థానిక పెద కాలువ వంతెన వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయంలో పూజలు చేశారు. కేశవరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఆలయం, అలాగే అర్తమూరు, ద్వారపూడి, తాపేశ్వరం, ఇప్పనపాడు, వెలగతోడు, మారేడుబాక తదితర గ్రామాల శివాలయాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధనల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సంగమేశ్వరుని దర్శించుకున్న పృథ్వీరాజ్

ఏడిద సంగమేశ్వరస్వామివారిని యువనేత తోట పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అభిషేకాలు, పూజలతో మురిసిన ముక్కంటి

రాయవరం: పరమ శివుడ్ని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. పంచాక్షరి మంత్రాన్ని జపించి, శివుని అర్చించి, అభిషేకంతో పూజించారు. మండలంలోని చారిత్రక సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. ఈ నెల 12 నుంచి ఈ ఆలయంలో పంచాయతన సహిత మహా రుద్రయాగం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు ఆలయాన్ని దర్శించుకన్నారు. సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. మహా రుద్రయాగంలో వందలాది మంది దంపతులు పాల్గొన్నారు. ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి, చెల్లూరులోని బాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, మాచవరంలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం 12 గంటల వరకు పలుచోట్ల భక్తులు బారులు తీరడం కన్పించింది. ఆలయాల్లో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి నిర్వహించారు. శివలింగాలకు పలుచోట్ల పంచ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. రాత్రి ఆలయం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. సోమేశ్వరం శివాలయంలో సుమారు 20 వేల మందికి అన్నదానం నిర్వహించారు. భక్తులు రాత్రి సమయంలో జాగారం చేసేందుకు అనువుగా పలు ఆలయాల వద్ద కోలాటాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాయవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం వద్ద మల్లిడి సుబ్బారెడ్డి, పులగం శ్రీనివాసరెడ్డి సౌజన్యంతో ప్రసాద వితరణ చేశారు.

కిటకిటలాడిన శివాలయాలు

కాజులూరు: మండలంలో గొల్లపాలెం, కాజులూరు, శీల, దుగ్గుదూరు, కుయ్యేరు, అయితపూడి, పెనుమళ్ల, అండ్రంగి, పల్లిపాలెం, ఉప్పుమిల్లి, కోలంక, జగన్నాథగిరి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తాగునీరు, అల్పాహారం పంపిణీతో పాటు ఉచిత భోజన ఏర్పాటు చేశారు.


సోమేశ్వరం ఆలయంలో మహా రుద్రయాగంలో పాల్గొన్న దంపతులు


గొల్లపాలెంలోమ బారులు తీరిన భక్తులు


విద్యుద్దీపాలంకరణ మధ్య ఘంటాంబికా అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఉయ్యాల జంపాల క్షేత్రాన్ని దర్శించుకున్న ఎంపీ అనూరాధ


ఉయ్యాల జంపాల దైవ క్షేత్ర దర్శనంలో ఎంపీ అనూరాధ

కపిలేశ్వరపురం: శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలోని అన్నపూర్ణ సమేత త్రయంబకేశ్వర స్వామిని ఎంపీ చింతా అనూరాధ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఇతర ప్రజా ప్రతినిధులు దర్శించుకున్నారు. అష్ట సోమేశ్వరాలయాల్లో నాలుగో ఆలయమైన కోరుమిల్లి గుడికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పూజలు చేశారు. పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రంలోని అన్నపూర్ణ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు. అంగరలోని సుబ్రహ్మణ్యస్వామి, తాతపూడిలోని మల్లేశ్వరస్వామి, కపిలేశ్వరపురంలోని అగస్త్యేశ్వరస్వామి, పడమర ఖండ్రికలోని ఖబ్బాలింగేశ్వరస్వామి, వల్లూరు, నేలటూరు, కాలేరు, నల్లూరు, టేకి, వాకతిప్ప, లంక గ్రామాల శివాలయాల వద్ద భక్తులు పూజలు చేసి తరించారు.

శివనామస్మరణతో మార్మోగిన కోటిపల్లి


అఖండి దీపారాధన చేస్తున్న చాగంటి వంశీయులు

కె.గంగవరం: మండలంలోని పుణ్యక్షేత్రం కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే గౌతమీ గోదావరి నది వద్ద పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

స్వామి వారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దంపతులు ఆలయం వద్ద పత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం, ఎంపీపీ పంపన నాగమణి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు.

ఆకట్టుకున్న పూల అలంకరణ

ఈ ఏడాది ఆలయంలో పాటు స్వామివారికి అమ్మవారికి, మండపాలకు, ద్వారాలకు చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఈఓ జె. రామలింగేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు పలు సేవా సంస్థలు, నాయకులు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు

వైభవంగా అఖండ దీపారాధన

ఛాయా సోమేశ్వర స్వామివారి ఆలయం వద్ద చాగంటి వంశీయులు అఖండ దీపారాధనను వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినాన్ని ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు చాగంటి వంశీయులు గత పది తరాలుగా అఖండ దీపారాధన చేస్తారు.

హర హర మహాదేవా..శంభో శంకరా..


ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి తొలి అభిషేకం చేస్తున్న మంత్రి వేణు కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: ప్రణవ పంచాక్షరీ మంత్రం 'ఓం నమశ్శివాయ' స్మరణతో రామచంద్రపురం నియోజకవర్గంలోని శివాలయాలు ప్రతిధ్వనించాయి. పుణ్యగోదావరి నదిలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. లింగోద్భవ సమయం వరకూ ఉపవాసంతో ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.

రామచంద్రపురం మండలంలో...

రామచంద్రపురంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెల్ల, కుందాలమ్మచెరువు, ఏరుపల్లి, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల హసన్‌బాద తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలోను, ద్రాక్షారామ ఓం శాంతి ఆశ్రమంలోను భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి శివభక్తులు మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామివారి దర్శనానికి క్యూలైన్‌లలో పోటెత్తారు. ఆలయాల వద్ద పలు సేవా సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు, వ్యాపార సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

ఘంటాంబికా అమ్మవారి ఆలయం వద్ద..

దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి దేవాలయానికి దక్షిణాన ఉన్న దక్షగుండం వద్ద ఘంటాంబికా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖండ దీపారాధన, భారీ శివలింగం భక్తులను కట్టిపడేసింది. దేవాలయం చుట్టూ కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ మధ్య అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఉద్విగ్నతకు గురయ్యారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 33 మట్టి కుండలతో అభిషేక ద్రవ్యాలు, సప్త నదుల జలాలు, 12 గుండాల నుంచి సేకరించిన జలాలతో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ కుటుంబ సమేతంగా స్వామికి తొలి అభిషేకం నిర్వహించారు. రుత్విక్కులు, వేదపండితులు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ


వి.సావరంలో దీపాలంకరణ


కోటిపల్లి ఆలయం వద్ద కనుల పండువగా వెలిగించిన దీపాలు


జ్యోతిర్లింగార్చనలో చైర్‌పర్సన్ దుర్గారాణి, భక్తులు

రాయవరం: మండలంలోని వి.సావరంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. గ్రామంలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయం వద్ద మహా శివరాత్రిని పురస్కరించుకుని దీపాలంకరణ చేశారు. ఈ దీపాలంకరణ కోసం గ్రామానికి చెందిన వెలగల సుధీర్‌కుమార్ రెడ్డి రూ.4 లక్షల వ్యయంతో 35 అడుగులతో ఐరన్ అరపను ఆలయానికి అందజేశారు. పలువురు భక్తులు భక్తి ప్రపత్తులతో స్వయంగా దీపాలు వెలిగించుకున్నారు. అరపపై ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సర్పంచ్ కాకి కృష్ణవేణి కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సత్తి రామచంద్రారెడ్డి, గ్రామ పెద్ద నల్లమిల్లి వెంకటరామారెడ్డి (చిన్న) తదితరులు సుధీర్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

మండపేట: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి పట్టణంలోని రథం గుడిలోని అగస్త్యేశ్వర కై లాశేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా జ్యోతిర్లింగార్చన జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, అధిక సంఖ్యలో మహిళలు దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు అయినవిల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపారాధన

కె.గంగవరం: కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కోటి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయంలో ప్రాంగణంలో తొలుత స్వామివారి ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు అధికారుల సమక్షంలో దీపారాధనను ప్రారంభించారు. ఆలయంలో దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు. గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను), దంగేటి వీర బ్రహ్మం, దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు రామలింగేశ్వరావు, దీపారాధన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో జ్యోతిర్లింగార్చన


ఆకట్టుకునేలా ఉన్న జ్యోతిర్లింగార్చన

రామచంద్రపురం రూరల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని దక్షిణ కాశీ ద్రాక్షారామలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి ఆలయ ఛండీ హోమందారుడు ఇంద్రకంటి రామారావు శర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) జ్యోతి ప్రజ్వలన చేసి జ్యోతిర్లింగార్చన ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

300 మందికి హోమియో వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో వెంకటేశ్వరరెడ్డి, బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: మహిళల ఆర్థిక స్వావలంభనకు, పేదల ఆరోగ్య రక్షణకు రెండున్నర దశాబ్దాల క్రితం ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి ఆధ్యాత్మికవేత్త సత్తి బులిస్వామిరెడ్డి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కాకినాడ ఎస్ఆర్ఎంటీ డైరెక్టర్ సత్తి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ట్రస్టు చైర్మన్ బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అర్తమూరులో నిర్వహించిన 156వ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ట్రస్టు చైర్మన్ బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి చేతనైనంతలో ఇతరకు సాయం చేయాలన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలనుసద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరంలో 300 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా బీపీ, సుగరు పరీక్షలు నిర్వహించారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, కోనాల సత్తిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, తాడి సుబ్బిరెడ్డి, వెలగల శివారెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరుపు రంగు కార్డు అర్హుల వివరాలు సేకరిస్తున్నాం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఎరుపు రంగు కార్డుకి అర్హుల వివరాలు సేకరిస్తున్నామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు అత్యధిక సంఖ్యలో ఉన్నా వివిధ ప్రభుత్వ పథకాలు వర్తించే ఎరుపురంగు కార్డులు మంజూరు చేయకుండా కేవలం ఏ పథకాలు వర్తించని పసుపు రంగు కార్డు(ఏపీఎల్) ఇచ్చి సివిల్ సప్లయిస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పుదుచ్చేరి నుంచి ఉన్నతాధికారులు మాట్లాడి ఎరుపు రంగు కార్డుకు అర్హులైన వారి జాబితాను పంపాలని స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులను కోరారని, అయితే ఎవరూ అర్హులు లేరని తెలపడం ఎంతవరకు సమంజమన్నారు. అందుకే తాను ఎరుపురంగు కార్డుకు అర్హులైనవారి వివరాలను సేకరిస్తున్నానని, త్వరలో వాటిని ఎల్జీ వద్దకు తీసుకువెళతానని తెలిపారు.

పుదుచ్చేరి స్టేట్ బెస్ట్ చైల్డ్ అవార్డులకు ఎంపిక

యానాం: పుదుచ్చేరి స్టేట్ బెస్ట్ చైల్డ్ అవార్డుల జాబితాను శనివారం విద్యాశాఖ విడుదల చేసిందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. యానాం రీజియన్‌లో 2022 సంవత్సరానికి గాను రీజెన్సీ కళాశాల విద్యార్థిని మాగాపు దీపిక(క్రియేటివ్ రైటింగ్), 2021 సంవత్సరానికి శారదా విద్యానికేతన్ ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థిని కేఆర్ఆర్ఎల్‌డీ శేషిత(క్రియేటివ్ ఆర్ట్), 2020 సంవత్సరానికి గాను రీజెన్సీ కళాశాల విద్యార్థిని టి.లక్ష్మీమాధవి(క్రియేటివ్ రైటింగ్) ఎంపికయ్యారన్నారు. వారికి మార్చి నెలలో పుదుచ్చేరి బాలభవన్‌లో జరిగే కార్యక్రమంలో ఎల్జీ తమిళిసై సౌందరాజన్ చేతుల మీదుగా రూ.5 వేల నగదు, ప్రశంసాపత్రాల్ని ప్రదానం చేస్తారన్నారు. విజేతలను రీజెన్సీ ప్రిన్సిపాల్ మార్తాండ ప్రసాద్, బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు అభినందించారు.